మూసీ సుందరీకరణ పేరుతో..

సర్కారే మా ఇళ్లను కూల్చేసింది

హక్కుల నేత మేధాపాట్కర్ కు గోడు విన్నవించుకున్న నిర్వాసితులు

బాధితులతో కలిసి ఉద్యమిస్తాం- పాట్కర్

మలక్‌పేట మూసీ తీరంలో నిర్వాసితులకు పరామర్శ

మలక్ పేట, మార్చి 3: మూసీ తీరంలో నిర్వాసితులతో కలిసి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని నర్మదా బచావో ఉద్యమకారిణి, హక్కుల నేత మేధాపాట్కర్ హెచ్చరించారు. సోమవారం పాత మలక్ పేట డివిజన్ శంకర్ నగర్ లోని మూసీ నిర్వాసితుల కాలనీల్లో పర్యటించారు. మూసీ నిర్వాసితులకు సరైన న్యాయం జరగలేదన్న సమాచారాన్ని అందుకున్న ఆమె సోమవారం ఉదయం 8 గంటలకు మూసీ సుందరీకరణ కోసం ఇళ్లు కూలగొట్టిన కాలనీలో పర్యటించారు. అక్కడి బాధితులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం తమ ఇళ్లను కూల్చివేసిందని రోదించారు. ఒక్కో ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు నివసించేవని ఇప్పుడు వారంతా దిక్కూ మొక్కు లేక నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు వందల గజాల స్థలంలో నిర్మించిన ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివసించేవని, మూసీ సుందరీకరణ పేరుతో తమ నివాసాలను కూల్చివేసిన అధికారులు, తమకు ఒకే ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించి చేతులు దులుపుకోవడంతో మిగతా రెండు, మూడు కుటుంబాలు రోడ్డున పడ్డాయని గోడును వెళ్లబోసుకున్నారు. మూసీ నిర్వాసితులకు ఇండ్ల పరంగా కాకుండా, కుటుంబాల పరంగా లెక్క వేసి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని కోరారు. చాదర్ ఘాట్ లోని మూసా నగర్, పాత మలక్ పేట డివిజన్ లోని శంకర్ నగర్, మూసారాంబాగ్ డివిజన్ లోని అంబేద్కర్ హట్స్, అజయ్ హట్స్, జాంబవంతుని హట్స్, సాయిలు హట్స్ ప్రాంతాలు మూసీ బెడ్‌లో ఉన్నాయని సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చివేశారని చెప్పారు. నగరంలోని ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు రోజుల క్రితం వచ్చిన ఆమె, సోమవారం పాత మలక్ పేటలోని శంకర్ నగర్ నివాసం ఉంటున్న సామాజిక కార్యకర్త, మానవ హక్కుల వేదిక జంట నగరాల ఉపాధ్యక్షుడు అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకున్న ఆమె అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మూసి నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె, బాధితులకు న్యాయం చేకూరేలా పోరాడాలన్నారు. ఆమె పర్యటనపై సమాచారాన్ని అందుకున్న చాదర్ ఘాట్ పోలీసులు వెంటనే ఆమెను అక్కడి నుంచి వెళ్లిపోవాలని పట్టుబట్టి పంపించివేశారు.

ఎల్ ఆర్ ఎస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి

ఆదిబట్ల,మార్చి 03: ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతీఒక్కరు మార్చి 31 లోగా రుసుం చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకుంటే 25శాతం రాయితీ వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు.సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ లేఅవుట్‌లోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు తీసుకు వచ్చిన ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులకు సూచించారు.మండల, మున్సిపాలిటీ స్థాయిలలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు ప్రతి ప్లాట్ ఓనరును ఎల్ఆర్ఎస్ సద్వినియోగం చేసుకునేలా చేయాలని అన్నారు.ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయుట ఆడియో రికార్డింగ్ చేసే స్వచ్ఛ ఆటోల ద్వారా ప్రచారం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 57 ఫిర్యాదులు...

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు.సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలే తమ సమస్యలను పరిష్కారం కోసం ఫిర్యాదులు చేసుకోవడానికి వస్తున్నారని అన్నారు.వారి అర్జీలను ప్రతి జిల్లా వివిదశాఖల అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు.ప్రజావాణిలో 57 ఫిర్యాదులు వచ్చాయని అందులో రెవిన్యూశాఖ-34,ఇతరశాఖలు-23,మొత్తం 57 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధశాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు,మండల తహశీల్దార్లు,కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

– ఐపీఎస్ సందీప్ శాండిల్యా

సదస్సులో మాట్లాడుతున్న ఐపీఎస్ సందీప్ శాండిల్యా

నందిగామ,మార్చి03: మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఐపీఎస్ సందీప్ శాండిల్యా పిలుపునిచ్చారు. నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామంలోని సింబియాసిస్ యూనివర్సిటీలో సోమవారం లా విద్యార్థులకు మత్తు మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ఐపీఎస్ సందీప్ శాండిల్యా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, హరిచంద్రరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, లీగల్ ఎయిడ్ సెంటర్ అధ్యక్షుడు అనన్య సక్సేనా, సింబయాసిస్ డైరెక్టర్ సునీల్ జార్జ్, వేణు గోపాల్‌రావు, రజనీకాంత్, కె.శాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఆర్ఏ పెంచాలని వినతి

జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందచేస్తున్న గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు

ఆదిబట్ల, మార్చి 3: రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ఏ 24శాతానికి పెంచాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ కె.రామారావు, సెక్రెటరీ శ్రీనేష్ కుమార్ నోరి అధ్వర్యంలో సోమవారం జిల్లా ఇంచార్జి మంత్రి డి.శ్రీధర్ బాబుకు ఆమర నివాసంలో కలిసి వినతి పత్రం అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐడీఓసీ కొంగరకలాన్‌లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యంగా ఉద్యోగులకు తగ్గించిన ఇంటి అద్దె భత్యాన్ని 24శాతం కు పెంచాలని, గత రెండు సంవత్సరాల నుండి కొంగరకలాన్ లో పని చేస్తున్న ఉద్యోగులకు ఆర్థికంగా చాలా నష్టం జరిగిందని అన్నారు. గతంలో నగరంలో ఉన్న కలెక్టర్ కార్యాలయం ను కొంగరకలాన్‌కు మార్చారని, సుమారుగా ఆరు వందల మంది ఉద్యోగులు ఇక్కడ పని చేస్తున్నారన్నారు. అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి నగరం నుండి ఇక్కడికి వచ్చి పని చేస్తున్న ఉద్యోగులకు వారికి వచ్చే హెచ్‌ఆర్ఏను11 శాతానికి తగ్గించిందని, కావున, కొంగరకలాన్ లో పని చేస్తున్న ఉద్యోగుల హెచ్ఆర్ఏ 24శాతానికి పెంచాలని మంత్రి గారికి వివరించామని అన్నారు.వెంటనే మంత్రి సానుకూలంగా స్పందించి ఉద్యోగులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు.

గోవాలో వైభవంగా వివాహం.. ఆరు నెలలకే బలవన్మరణం

రాయదుర్గంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

శేరిలింగంపల్లి, మార్చి 03: ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిన జంట ప్రేమించి, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన ఆరు నెలలు గడవక ముందే ఇద్దరి మధ్య తరచూ గొడవలు ప్రారంభమై తీవ్ర మనస్తాపానికి గురైన భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లా, తోర్ మామిడి కమలాపురం ప్రాంతానికి చెందిన దేవిక (25) పుణేలో ఎంబిఏ పూర్తి చేసి నగరంలోని ఓ సాఫ్ట్ వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నది. ఐఐటి ఖరగ్‌పూర్ లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన మంచిర్యాలకు చెందిన సద్గుర్తి సతీష్‌చంద్ర కూడా దేవిక పనిచేస్తున్న సాఫ్ట్ వేర్ సంస్థలోనే ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. ఒకే కార్యాలయం కావడంతో దేవిక, సతీష్‌చంద్రల మధ్య పరిచయం ఏర్పడి, ప్రేమగా మారడంతో ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇరువైపుల పెద్దలను ఒప్పించి గత ఆగస్టు 23వ తేదీన గోవాలో వైభవంగా వివాహం చేసుకున్నారు. వివాహం అనంతరం భార్యాభర్తలు రాయదుర్గం పరిధిలోని ప్రశాంతిహిల్స్‌లో కాపురం పెట్టారు. పెళ్లైన కొద్దిరోజులకే భార్య, భర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ మధ్య కాలంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో దేవిక, సతీష్‌చంద్రలు ఇంట్లో గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన దేవిక తన గదిలోకి వెళ్లి లోపలి నుంచి గడియ పెట్టుకుంది. సతీష్ చంద్ర సైతం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి అర్ధరాత్రి 12 గంటల తరువాత తిరిగి వచ్చాడు. అప్పటికీ దేవిక గది తలుపులు పెట్టి ఉండడంతో తలుపు తట్టి చూడగా, లోపలి నుంచి గడియపెట్టి ఉండడంతో నిద్రపోయిందని భావించి తనగదిలోకి వెళ్లి నిద్రపోయాడు. తెల్లవారు జామున లేచిన సతీష్ చంద్ర మరోసారి దేవిక గది తలుపుతట్టినా స్పందించలేదు. ఉదయం పనిమనిషి వచ్చి తలుపుకొట్టినా దేవిక తలుపు తీయలేదు. మరోవైపు ఉదయం 10 గంటలకు దేవిక ఆఫీసుకు వెళ్లాల్సి ఉండగా, అప్పటికీ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సతీష్‌చంద్ర గది తలుపులు బద్దలుకొట్టి చూడగా, గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతురాలి తల్లి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా కట్నం కోసం తరచూ సతీష్‌చంద్ర వేధించడంతోనే తన కుమార్తె మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇన్నేళ్లు చోద్యం చూసి..

ఇప్పుడు రద్దు చేసి..

అధికారుల మౌనం.. 800 మంది విద్యార్థులకు శాపం!

లంగర్‌హౌజ్‌లోని ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అనుమతులు రద్దు

అనుమతి లేదని తేల్చిన హైదరాబాద్ విద్యాశాఖ అధికారులు

ఇన్ని నెలలు ఏం చేశారంటూ తల్లిదండ్రుల ఆగ్రహం

పరీక్షల సమయంలో మరో స్కూల్‌కు మార్చడంపై విమర్శలు

సిటీబ్యూరో/ మెహిదీపట్నం, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : తాంబూలం ఇచ్చాం.. తన్నుకు చావండి అన్న చందంగా హైదరాబాద్ విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. కార్వాన్‌లోని లంగర్ హౌజ్‌లోని ఆర్చిడ్స్ ఇంటర్నేషన్ స్కూల్‌కు అనుమతి లేదని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారులు సోమవారం రద్దు చేశారు. అయితే ఈ రద్దు నిర్ణయంపై తల్లిండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 800 మంది విద్యార్థులు ఇందులో విద్యనభ్యసిస్తున్నారు. ఇన్ని నెలలుగా స్కూల్ నడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోని విద్యాశాఖ అధికారులు మరో నెలన్నర రోజులైతే అకాడమిక్ పూర్తై వేసవి సెలవులు రాబోతున్న సమయంలో పాఠశాలకు అనుమతి లేదని చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పాఠశాల ఏర్పాటుకు ప్రాథమిక అనుమతినిచ్చినా విద్యాశాఖాధికారులు అడ్మిషన్లు జరుగుతున్న సమయంలోనూ నోరు మెదపకుండా చోద్యం చూశారు. నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. తీరా అకాడమిక్ ముగింపునకు వస్తున్న సమయంలో పాఠశాలను రద్దు చేయడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పుడు జీహెచ్ ఎంసీ ఎన్ఓసీ, ఫైర్ ఎన్ఓసీ, ట్రాఫిక్ ఎన్ఓసీ లేదని స్కూల్ రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. స్కూల్‌కు అనుమతి లేని విషయం తల్లిదండ్రులకు ఎలా తెలుస్తుందని.. అంత పెద్ద బిల్డింగ్ నిర్మాణం జరిగి అది స్కూల్‌గా ఏర్పాటు చేస్తున్నా జిల్లా విద్యాశాఖాధికారికి కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని రాజు అనే పేరెంట్ ప్రశ్నించారు. ఇప్పుడు వేరే స్కూల్‌లో అడ్మిషన్ పొందాలంటే చాలా కష్టమని తెలిపాడు. పరీక్షల సమయంలో వేరే స్కూల్‌లో జాయిన్ చేస్తే అక్కడి వాతావరణం, కొత్త విద్యార్థులు, టీచర్లతో కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. చెల్లించిన ఫీజులు వెనక్కి ఇప్పిస్తారా అంటూ ప్రశ్నించాడు. కాగా, ఇదే ప్రాంతంలో కిలో మీటర్ లోపున ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు అడ్మిషన్లు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

బాధ్యత లేని విద్యాశాఖ..!

జిల్లాలో 3వేలకు పైగా పాఠశాలలు ఉన్నాయి. చాలా ప్రయివేట్ పాఠశాలలు అనుమతి లేకుండానే నడుస్తున్నాయని విద్యార్థి సంఘాలు జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం ఉండటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా చీకటి గదుల్లో పాఠశాలలను నడుపుతూ డబ్బులు దండుకుంటున్నారు. ఎలాంటి ఫైర్ సేఫ్టీ కూడా ఉండటం లేదు. ముఖ్యంగా ఎలాంటి ఆటస్థలం కూడా ఉండటం లేదు. రద్దీగా ఉండే రహదారుల పక్కన ఉన్న పురాతన భవనాల్లో సైతం పాఠశాలలను ఏర్పాటు చేసి బోర్డులు తగిలిస్తున్నారు. ఇంత జరుగుతున్న హైదరాబాద్ విద్యాశాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు కేవలం ఫిర్యాదు వస్తేనే స్పందించి చేతులు దులుపుకుంటున్నారు.

పోకిరీల్లో మైనర్లే ఎక్కువ

మహిళలు, యువతులతో వికృత చేష్టలు

నిఘా పెట్టి పట్టుకుంటున్న షీటీమ్స్

ఒక్కఏడాదిలో నాలుగింతలు పెరిగిన నిందితులు

పెంపకం లోపమే కారణమని కౌన్సిలింగ్‌లో వెల్లడి

సిటీబ్యూరో, మార్చ్ 3 (నమస్తే తెలంగాణ): ఇటీవల నుమాయిష్‌లో బోరబండకు చెందిన ఇద్దరు విద్యార్థులు యువతులను తాకేందుకు ప్రయత్నించడం, కొందరితో వెకిలిచేష్టలు వేస్తూ వారిని సతాయించారు. ఎవరూ గమనించడం లేదంటూ అసహ్యంగా వ్యవహరించారు. వీరిని గమనించిన షీటీమ్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

☞ సికింద్రాబాద్ స్టేషన్‌కు సమీపంలోని ఒక కాలనీలో వివాహిత అక్కడ షాపింగ్ మాల్‌కు వెళ్లి వస్తుంటే ముగ్గురు బండిపై వచ్చి అసభ్యంగా ప్రవర్తిస్తూ కామెంట్ చేస్తూ వేధించారు. మరో ప్రాంతంలో నైట్‌డ్యూటీ చేసి వస్తున్న ఉద్యోగినులను నలుగురు మైనర్లు వేధించారు. వారిని దారుణంగా కామెంట్ చేస్తూ టూవీలర్స్‌పై ఫీట్లు చేస్తూ భయపెట్టారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా హైదరాబాద్‌కు వలస వచ్చిన కుటుంబాల పిల్లలు కావడం, తల్లిదండ్రుల ఆజమాయిషీ లేకపోవడంతో పిల్లలు ఇలా తయారయినట్లుగా కౌన్సిలింగ్‌లో తేలింది.

బుద్ధిగా చదువుకోవలసిన పిల్లలు దారితప్పుతున్నారు. ఆకతాయిలుగా పోలీసు రికార్డులకు ఎక్కుతున్నారు. బహిరంగప్రదేశాలలో యువతులను వేధిస్తున్న వారిలో మైనర్లే పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. హైదరాబాద్‌లో షీటీమ్స్‌కు చిక్కుతున్న వారిలో ఎక్కువగా 18 సంవత్సరాలలోపు పిల్లలే ఉండడం గమనార్హం. షీటీమ్స్ నిర్వహిస్తున్న డెకాయ్ ఆపరేషన్స్‌లో సరాసరి 35-40 శాతం మైనర్లే ఉంటున్నారు. అసభ్య పదజాలంతో దూషించడం, సామాజిక మాధ్యమాల్లో వేధించడం వంటి ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. మైనర్లు తమను వేధిస్తున్నారంటూ కొందరు వివాహితల నుంచి సైతం షీటీమ్స్‌కు ఫిర్యాదులొచ్చాయి.

రద్దీప్రాంతాలు, టూరిస్ట్‌ప్లేసుల్లో..!

షీటీమ్స్‌కు పట్టుబడుతున్న మైనర్ల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతోంది. గ్రేటర్‌లోని రద్దీ ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలు, మెట్రో రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలున్నచోట ఆకతాయిలు వేధింపులకు పాల్పడుతున్నారు. వీటిలో అధికశాతం చార్మినార్, గోల్కొండ, అమీర్‌పేట షాపింగ్‌ఏరియా, రేతిఫైల్ బస్‌స్టాండ్‌ల్లో జరుగుతున్నాయి. రద్దీగా ఉంటే చాలు.. అక్కడ యువతులను, మహిళలను టార్గెట్‌గా చేసుకుని వికృతంగా ప్రవర్తిస్తున్నారు. వీరి ఆగడాలతో మహిళలు ఆయా ప్రాంతాల్లో తిరిగే సమయంలో భయపడాల్సిన పరిస్థితి చోటు చేసుకుందని షీటీమ్స్‌కు ఫిర్యాదులందాయి. మైనర్ల ఆగడాలు శృతిమించుతున్న నేపథ్యంలో షీటీమ్స్ పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టి ఆయా ప్రాంతాల్లో పోకిరీల ఆటకట్టిస్తున్నారు.

పెంపకంలో లోపమే కారణం..!

మహిళలను వేధిస్తూ పట్టుబడుతున్న మైనర్లలో ఎక్కువ శాతం కుటుంబాల్లో సమస్యలు ఉన్నవారు, సరైన పెంపకం లేకపోవడం కారణంగానే అని కౌన్సిలింగ్‌ల్లో వెల్లడవుతోంది. ముఖ్యంగా అక్రమసంబంధాలు, కుటుంబసమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రుల్లో ఒక్కరే ఉన్న కుటుంబాల్లోని పిల్లలే ఎక్కువగా ఈ పోకిరీల్లో ఉంటున్నట్లుగా పోలీసులు కౌన్సిలింగ్ చేసే సమయంలో గమనించారు. సోషల్‌మీడియా ప్రభావం కూడా ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఎదిగే సమయంలో పిల్లలపై పెద్దల పర్యవేక్షణ లేకపోవడం మూలంగా వారు చెడుదారుల్లో పోతున్నారని పోలీసులు చెప్పారు. ముఖ్యంగా కొందరు మైనర్లయితే గంజాయి, మద్యం, వైట్నర్‌కు అలవాటుపడి అర్ధరాత్రిపూట టూవీలర్స్‌పై తిరుగుతూ రాత్రి వెళ్లే కుటుంబాలను సతాయిస్తున్నట్లు పోలీసులు గమనించారు. వీరిపై కూడా నిఘా పెట్టామని అయితే మైకంలో వారేం చేస్తున్నారో తెలియక తెల్లవారి వారు స్పృహలోకి వచ్చినతర్వాత వారి పరిస్థితి భిన్నంగా ఉంటున్నదని పోలీసులు తెలిపారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించి వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే ఖచ్చితంగా నిఘాపెట్టాలని, నెమ్మదిగా వారిని సన్మార్గంలో పెట్టే ప్రయత్నం చేయాలని పోలీసులు సూచించారు.

గత నాలుగేళ్లుగా షీటీమ్స్‌కు చిక్కిన మైనర్లు:

సంవత్సరం	షీటీమ్స్ పట్టుకున్న మైనర్‌లు
2021	42
2022	24
2023	25
2024	106

ఆదివారంలోగా హోర్డింగులు తొలగించండి!

లేకుంటే మేమే తొలగిస్తాం..

యాడ్ ఏజెన్సీలకు డెడ్‌లైన్ విధించిన హైడ్రా

సిటీబ్యూరో, మార్చ్3 (నమస్తే తెలంగాణ): అనుమతులు లేని అడ్వర్టైజ్‌మెంట్ హోర్డింగులను ఈనెల 9లోగా తొలగించాలని, లేకుంటే తామే తొలగిస్తామంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ యాడ్ ఏజెన్సీ నిర్వాహకులకు చెప్పారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో తనను కలిసిన యాడ్ ఏజెన్సీ నిర్వాహకులతో రంగనాథ్ సమావేశమయ్యారు. ఆదివారం బాలానగర్ చౌరస్తాలో హోర్డింగులను తొలగించడానికి వచ్చిన హైడ్రా బృందాన్ని వెనక్కు పంపిన తెలంగాణ ఔట్ డోర్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం రంగనాథ్‌ను కలిసి తమ వద్ద హోర్డింగులను ఎందుకు తొలగిస్తున్నారంటూ ప్రశ్నించారు. మూడు నెలలుగా ఈ అంశంపై మాట్లాడుతున్నామని, పలుసార్లు మున్సిపల్ కమిషనర్లు, యాడ్‌ఏజెన్సీల ప్రతినిధులతో కూడా సమావేశమై చర్చించిన విషయాన్ని రంగనాథ్ చెబుతూ వారి సమస్యలను విన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన రుసుము గడువు 2024 మార్చ్ 31 వరకు ఉందని.. ఈలోగా గత సంవత్సరం ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తామని చెప్పడంతో రెన్యువల్స్ ఆగిపోయాయని, దీంతో 2022-23 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఫీజులు కూడా చెల్లించలేకపోయామని ఏజెన్సీల నిర్వాహకులు రంగనాథ్‌కు చెప్పారు. ఈ నేపథ్యంలో 2023 మార్చ్ 31 వరకు చెల్లింపులు చేసిన హోర్డింగుల విషయంలో ప్రభుత్వం ఒకనిర్ణయం తీసుకునే వరకు ఆ హోర్డింగులను తొలగించబోమని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రంగనాథ్ తెలిపారు. వాస్తవానికి అడ్వర్టైజ్‌మెంట్ హోర్డింగుల ద్వారా ప్రభుత్వానికి వందల కోట్ల ఆదాయం రావలసి ఉన్నా.. ప్రస్తుతం రూ.20 నుంచి రూ.30కోట్లు మాత్రమే వస్తున్నదని చెప్పారు. అక్రమ హోర్డింగుల విషయంలో హైడ్రా మినహాయింపు ఇవ్వమని, హైడ్రా వాటిని తొలగిస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు.

హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు

సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ప్రజావాణిలో 49 ఫిర్యాదులం దాయి ఇందులో నగరశివార్లలోని లేఔట్లకు సంబంధించినవే ఉన్నాయని హైడ్రా ఒక ప్రకటనలో పేర్కొంది. తమకు అమ్మినవారే కొన్ని చోట్ల కబ్జాలకు పాల్పడ్డారని కొందరు, పంచాయతీ లేఔట్లను బాలాపూర్ మండలం నాదుర్‌గుల్ గ్రామంలో 1980వ దశంకంలో 2684 ప్లాట్లతో చాణక్యపురి లేఔట్‌చేయగా .. 2024 సంవత్సరం వచ్చేసరికి అందులో 30 ఎకరాలు కబ్జా అయిందని స్థానికులు చెప్పారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 58,59 లలో ఉన్న ఎన్ఎంఆర్-దివ్యానగర్ లేఔట్‌లో తాము ప్లాట్లు కొనగా.. ఇప్పుడవి కనిపించడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. గోపన్నపల్లిలో టిఎన్‌జిఓ కాలనీలో ఉద్యోగులకు కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చారని టిఎన్‌జిఓ కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులు హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి మృతి

మరో వ్యక్తికి గాయాలు.. క్షేమంగా బయటపడ్డ మహిళ

శేరిలింగంపల్లి, మార్చి 3: ఐటీ కారిడార్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి మృతిచెందగా, మరో వ్యక్తి గాయాలైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా, కొర్వి మండలం, పెద్దగూడ తాండా ప్రాంతానికి చెందిన గుగులోత్ గోవింద్ (29) కొంతకాలం క్రితం బతుకు దెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని ఓ సాఫ్ట్ వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తూ టెలికాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గోవింద్ తన ద్విచక్రవాహనం రాయల్ ఎన్ ఫీల్డ్ మీద టెలికాంనగర్ నుంచి మాదాపూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ కింద తన ముందు వెళ్తున్న హీరో ప్యాషన్ ద్విచక్రవాహనం ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో గోవింద్ బైక్ స్పీడ్ కంట్రోల్ తప్పి రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్యాషన్ వాహనం మీద వినోద్ అనే వ్యక్తి తన భార్య జ్యోతితో కలిసి గౌలిదొడ్డి నుంచి కూకట్ పల్లికి వెళ్తున్నాడు. వాహనాలు ఢీకొన్న సమయంలో ఎన్ ఫీల్డ్ మీద ఉన్న గోవింద్ ఎగిరి పక్కనే ఉన్న సిమెంటు దిమ్మ మీద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం అతన్ని గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం గోవింద్ మృతి చెందాడు. ప్యాషన్ వాహనం మీద ఉన్న వినోద్ కు సైతం గాయాలు కాగా వెనుక కూర్చున్న అత